క్రీడా ప్రాంగణం గేట్‌కు తాళం వేసుడేందో!

క్రీడా ప్రాంగణానికి తాళం వేయడంతో నిరీక్షిస్తున్న క్రీడాకారులు

తొర్రూరు, డిసెంబర్ 23: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం గ్రామాల్లో, పట్టణ కేంద్రాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ హైస్కూల్‌లో పురపాలక సంఘం ఆధ్వర్యంలో రూ.లక్షల ఖర్చుతో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. ఇక్కడి క్రీడా ప్రాంగణంలో కనీస వసతులు దేవుడెరుగు, ఆడుకోవడానికి వీల్లేకుండా గేటుకు తాళం వేసి ఉండడంపై క్రీడాకారులు ఆగ్రహిస్తున్నారు. తాము ఆడుకుంటామని, తాళం వేయొద్దని కొంతకాలంగా కోరుతున్నా 'స్కూల్ మైదానంలో మీకేం పని?' అంటూ అధికారులు అంటున్నారని ఆరోపిస్తున్నారు. వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి క్రీడాకారులు ఆడుకునేందుకు వీలుగా గేట్ తాళం తీయించాలని క్రీడాకారులు డిమాండ్ చేస్తున్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల జీవితాల్లో వెలుగు నింపాలి

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 23 : సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగుల జీవితాల్లో వెలుగు నింపాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మైస నాగయ్య అన్నారు. సోమవారం పట్టణంలోని నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులకు సంఘీభావాన్ని తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ గత ఏడాది సమగ్ర శిక్షా ఉద్యోగులు ధర్నా చేస్తున్నప్పుడు తాము అధికారంలోకి రాగానే రెగ్యులర్ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, వెంటనే హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షా ఉద్యోగులు భవిష్యత్‌లో చేసే అన్ని కార్యక్రమాలకు మద్దతుగా ఉంటామని పేర్కొన్నారు. మహంకాళీ వీరన్న, వెంకటయ్య, నవీన్, సోమయ్య, భాస్కర్ రావు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులకు మద్దతు తెలుపుతున్న విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు

వర్షం వస్తే రైతుల పరిస్థితి ఏంటి?

ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

బయ్యారం, డిసెంబర్ 23: రెక్కలు ముక్కలు చేసుకొని పండించిన వరి పంట.. వర్షం వస్తే రైతుల పరిస్థితి ఏంటి? అంటూ ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీ సమీపంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. కాంటాలు వేసి వారం రోజులు గడుస్తున్నా ధాన్యపు బస్తాలను మిల్లులకు తరలించకపోవటంతో ఇబ్బంది పడుతున్నామనే విషయాన్ని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే ఆరా తీయగా ఆర్‌వోలు మంజూరుకాక ధాన్యం పేరుకుపోయిందని, మండలంలోని 16 కొనుగోలు కేంద్రాల్లో 50వేల బస్తాలు నిల్వ ఉన్నాయని అధికారులు వివరించారు. దీంతో జాయింట్ కలెక్టర్‌కు ఎమ్మెల్యే ఫోన్ చేసి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో బస్తాలు ఉంటే వర్షం వస్తే రైతులు నష్టపోయే పరిస్థితి ఉందని, వెంటనే ఆర్‌వోలు మంజూరయ్యేలా చూడాలని, లేకుంటే బస్తాలను గోదాంలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వెంటనే ధాన్యాన్ని గోదాంలోకి చేర్చాలని తహసీల్దార్ విజయకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. తహసీల్దార్ విజయ, ఎంపీడీవో విజయలక్ష్మి, సొసైటీ చైర్మన్ మూల మధుకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

మూఢ నమ్మకాలను వీడాలి

నర్సింహులపేట, డిసెంబర్ 23: ప్రజలు మూఢ నమ్మకాలను వీడాలని ఎస్సై సురేశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో పోలీస్ కళాబృందం సైబర్ నేరాలు, మూఢ నమ్మకాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు, బ్యాంకు, ఉన్నతాధికారులు ఎలాంటి ఓటీపీలు, బ్యాంకు సమాచారం అడగరని తెలిపారు. పోలీసు సిబ్బంది ఉన్నారు.

'ప్రజావాణి' ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి

కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 23 : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజలను ఫిర్యాదులు స్వీకరించారు. డోర్నకల్ మండలం ములకపల్లికి చెందిన ఆంజనేయులు తన భూమి సర్వే చేసి హద్దులు నిర్ధారించాలని విన్నవించాడు. మరిపెడ మండలం అబ్బాయిపాలెంకు చెందిన దేవిరాజు దివ్యాంగుల సర్టిఫికెట్ అందించాలని, కేసముద్రం మండలం నుంచి వాంకుడోత్ సూర్య అటవీ హక్కులపత్రంలో సర్వే నంబరు తప్పు పడిందని, వెంటనే సరి చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా అధికారులు వెంకటేశ్వర్లు, పురుషోత్తం, మధుసూదన్ రాజు, రవీందర్‌రెడ్డి, హరిప్రసాద్ పాల్గొన్నారు.

అత్యవసర పరిస్థితుల్లో అందరికీ వైద్యసేవలు

అత్యవసర పరిస్థితుల్లో హాస్పిటల్‌కు వచ్చే ప్రతి ఒక్కరికి వైద్యసేవలు అందించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్ ఉన్న విస్తరణ అభివృద్ధి పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. హాస్పిటల్ డాక్టర్లు, వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని, తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. అనంతరం డయాసిస్, పార్మసీ, ఇన్‌పెషెంట్, సాధారణ వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఆర్ఎంవో జగదీశ్ పాల్గొన్నారు.

వసతిగృహాల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

బయ్యారం: వసతిగృహాల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దని కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ, ఎస్సీ బాయ్స్ హాస్టల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, నామాలపాడు ఈఎంఆర్ఎస్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వసతి గృహాల్లోని డైనింగ్‌హాల్, కిచెన్‌షెడ్, క్లాస్ రూమ్స్, స్టడీరూమ్స్, స్టోర్ రూమ్స్, పరిసరాలను పరిశీలించారు. డైట్ మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన, భోజనం అందించాలని సూచించారు. వసతిగృహాల్లో రాత్రి సమయాల్లో విద్యుత్ సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డోర్లకు మెష్ సిద్ధం చేయాలని, టాయిలెట్స్ కిచెన్ షెడ్స్, ఎప్పటికప్పుడు సానిటేషన్ చేసి పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహసీల్దార్ బి.విజయ, ఎంపీడీవో విజయలక్ష్మి ఉన్నారు.

వైన్స్ షాపులో చోరీ

రూ.55 విలువైన మద్యం, రూ.5వేలు అపహరణ

తొర్రూరు, డిసెంబర్ 23: పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో భద్రకాళి వైన్స్‌షాపులో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. వైన్స్‌షాపులో పైకప్పునకు కన్న వేసి రూ.55వేల విలువైన మద్యం, రూ.5వేల నగదు చోరీకి చేసినట్లు తెలిపారు. వైన్స్ యజమాని శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రెయినేజీలో పడి వృద్ధురాలి మృతి

సోమనర్సమ్మ (ఫైల్)

దంతాలపల్లి, డిసెంబర్ 23: ప్రమాదవశాత్తు డ్రెయినేజీ కాల్వలో పడి ఓ వృద్ధురాలు మృతిచెందింది. ఈ ఘటన మండల కేంద్రంలో సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. దంతాలపల్లికి చెందిన ఏనుగంటి సోమనర్సమ్మ(76) ఇంట్లో నుంచి బయటకు వస్తుండగా ప్రమాదవశాత్తు ఇంటి ముందు అసంపూర్తిగా ఉన్న డ్రెయినేజీ కాల్వలో పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను బయటకు తీయగా అప్పటికే ఊపిరాడక మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ ఫైనల్ జాబితా విడుదల

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 23 : జాతీయ ఆరోగ్య మిషన్ పథకంలో కింద కాంట్రాక్ట్ పాతిపదికన జిల్లాలోని బ్లడ్‌బ్యాంకులో ల్యాబ్ టెక్నీషియన్ పోస్ట్ ఫైనల్ మెరిట్ జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఎంహెచ్‌వో మురళీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలక్షన్ కమిటీ రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ఎంపికైన అభ్యర్థులు ఈనెల 24న ఒరిజినల్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుందని తెలిపారు.

జీవితాలను నాశనం చేసుకోవద్దు

గూడూరు, డిసెంబర్ 23: విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు లోనై జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్సై గిరధర్‌రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల వాడకంతో దుష్పరిణామాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు ఉపయోగించిన వారికి ఆరోగ్యంతోపాటు కుటుంబాల్లోనూ ఇబ్బందులు తలెత్తుతాయని, సమాజంలో విలువ ఉండదని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ పరుశురాములు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బాబు పాల్గొన్నారు.

వాతావరణ అనుకూల పంటలు సాగు చేయాలి

కిసాన్ మేళాలో పాల్గొన్న శాస్త్రవేత్తలు, రైతులు

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 23 : రైతులు వాతావరణ పరిస్థితులకు అనుకూల పంటలను సాగు చేయాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సంచాలకులు డాక్టర్ ఉమారెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రంలో కిసాన్ మేళా, వ్యవసాయ ప్రదర్శన ఘనంగా నిర్వహించారు. ఇక్కడ మట్టి పరీక్ష కేంద్రం, సమీకృత వ్యవసాయపాఠశాల కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించే వ్యవసాయంతోపాటు అనుబంధ రంగాల వైపు దృష్టిసారించాలన్నారు. సరైన సస్యరక్షణ చర్యలు యాంత్రీకరణ వైపు సాగుతూ పంటలను సాగుచేయాలన్నారు. శాస్త్రవేత్తలు రైతులకు కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకుని నూతన పద్ధతులతో ముందుకుపోవాలని తెలియజేశారు. కృషి విజ్ఞాన కేంద్ర సమన్వయకర్త మాలతి, డాక్టర్ వీరన్న, విజయనిర్మల, మరియన్న, ప్రశాంత్ పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య ఆశయాల కోసం పోరాడుదాం

దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే మురళీనాయక్

గూడూరు, డిసెంబర్ 23: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విప్ బీర్ల ఐలయ్య, స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణలో పాల్గొన్న అనంతరం సభలో మాట్లాడుతూ అన్యాయంపై పోరాటం చేసే గుణం ఓరుగల్లు మట్టిలో ఉన్నదని అన్నారు. వరంగల్‌లో నిర్మించే విమనాశ్రయానికి దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరుతామని తెలిపారు. గొల్లకురుమలు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. పారా ట్రోబాల్ క్రీడాకారిణి దయ్యాల భాగ్యను సన్మానించారు. ప్రొఫెసర్ కంచ అయిలయ్య, ప్రజా గాయని విమలక్క, చీర అశోక్ పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణానికి భూమి విరాళం

భూమి పత్రాన్ని మండల వైద్యాధికారికి అందస్తున్న గుంట శ్రీనివాస్

గంగారం, డిసెంబర్ 23: మండలంలో నూతనంగా ఏర్పడిన కొడిశలమిట్ట గ్రామపంచాయతీకి మంజూరైన ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన గుంట శ్రీనివాస్ భూమి విరాళంగా ప్రకటించారు. ఈమేరకు సోమవారం భూమికి సంబంధించిన పత్రాన్ని మండల వైద్యాధికారికి ప్రత్యూషకు గ్రామ పెద్దలతో కలిసి అందజేశారు. శ్రీనివాస్‌కు వైద్యాధికారి కృతజ్ఞతలు తెలిపారు. పుల్సం నాగేశ్వరావు, గుంట వసంతరావు పాల్గొన్నారు.

కుంటలో మునిగి రెండు ఎడ్లు మృతి

మృత్యువాత పడిన ఎడ్లను చూస్తున్న గ్రామస్తులు

కురవి, డిసెంబర్ 23: నీళ్లు తాగేందుకు వెళ్లిన రెండు ఎడ్లు కుంట నీటిలో మునిగి మృత్యువాత పడిన ఘటన మండలంలోని కందికొండలో సోమవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతు తొడుసు వీరన్న వ్యవసాయపనుల కోసం ఎడ్లకు గొర్రు కట్టుకుని వెళ్తున్నాడు. నాగులకుంటలో నీళ్లు తాగేందుకు దిగిన ఎద్దులు జారి నీటిలో మునిగిపోయాయి. ఇటీవల రోడ్డు నిర్మాణ పనుల్లో ఈ కుంటలో మట్టి ఎక్కువగా తీయడంతో బావిని తలపిస్తుందని గ్రామస్తులు ఆరోపించారు. రెండు ఎడ్లు ఒక్కసారిగా నీటిలోకి జారి పడగా మెడపై గొర్రుకు ఉన్న దుత్త ఉరిలా మారి మృత్యువాత పడ్డాయి. సాగులో సాయం చేసిన ఎడ్లు కళ్లముందే మృతి చెందడంతో రైతు బోరున విలపించాడు. వీటి విలువ సుమారు రూ.2లక్షలు ఉంటాయని ఆవేదన వ్యక్తం చేశాడు. గ్రామస్తులు రోడ్డు పనుల కోసం వెళ్తున్న టిప్పర్లను ఆపి రైతుకు న్యాయం చేయాలని ఆందోళన చేశారు.

లబ్ధిదారుల జాబితా ఇవ్వని అధికారులు

కురవి, డిసెంబర్ 23: అకాల వర్షానికి పంటలు నష్టపోగా పరిహారం మంజూరైన రైతుల జాబితాను అధికారులు ఇవ్వడంలేదని కురవి ఆలయ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు కొర్ను రవీందర్‌రెడ్డి, గుండ్రాతిమడుగు(విలేజ్) సొసైటీ చైర్మన్ గార్లపాటి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం ఆలయ సత్రాల వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నాలుగు నెలల క్రితం అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు మూడు నెలల క్రితం ప్రభుత్వం పరిహారాన్ని విడుదల చేసిందన్నారు. ఎవరెవరికీ వచ్చిందో జాబితా ఇవ్వాలని ఏవో, ఏఈవోలను కోరితే స్పందించడం లేదని మండిపడ్డారు. ఆర్‌టీఏ ద్వారా కోరినా స్పందించని మండల, క్లస్టర్ వ్యవసాయాధికారులపై జిల్లా వ్యవసాయాధికారిణి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు ఎర్ర నాగేశ్వర్‌రావు, నారాయణ రాజేందర్‌కుమార్, బాలగాని శ్రీనివాస్, చిన్నం గణేశ్ పాల్గొన్నారు.

29న ఏఎన్ఎంల రాత పరీక్షను రద్దు చేయాలి

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 23 : ఈనెల 29న జరిగే ఏఎన్ఎంల రాత పరీక్షను రద్దు చేయాలని వైద్య ఆరోగ్య ఉద్యోగ సంఘాల పోరాట కమిటీ జిల్లా నాయకురాలు నసీమాబేగం అన్నారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 20 ఏళ్లుగా పనిచేస్తున్న ఏఎన్ఎంలకు ప్రభుత్వం కావాలనే రాత పరీక్షలు పెట్టేదుకు సిద్ధమైందని, వెంటనే ఏఎన్ఎంలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారి మురళీధర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. స్నేహలత, అశ్విని, పార్వతి, వనిత పాల్గొన్నారు.

కొండచిలువ హతం

నర్సింహులపేట, డిసెంబర్ 23: మండలంలోని పెద్దనాగారంలో సోమవారం రాత్రి కొండచిలువ హతమైంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామంలోని గంగమ్మ ఆలయం వద్ద రహదారి పక్కన గొర్రెల మంద ఉంది. కొండచిలువ అటుగా వస్తుండగా గమనించిన గొర్రెల కాపారులు హతం చేశారు. సుమారు 15ఫీట్ల పొడవు ఉండటంతో గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు.

సద్వినియోగం చేసుకోవాలి

తొర్రూరు, డిసెంబర్ 23: అంగన్‌వాడీ సేవలు బాలింతలు, గర్భిణీలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ ఏసీడీపీవో ఇందిరా కోరారు. సోమవారం పట్టణంలోని ఎరుకలకాలనీలోని అంగన్‌వాడీ సెంటర్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. సూపర్‌వైజర్ శ్రీదేవి అంగన్‌వాడీ టీచర్ శైలజ పాల్గొన్నారు.

అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలి

గార్ల: గార్ల నెహ్రూసెంటర్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 23 : అంబేద్కర్‌ను కించపరిచేలా మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు కోండ్ర ఎల్లయ్య అన్నారు. సోమవారం పట్టణంలోని కేటీఆర్ నగర్ కాలనీలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ అంబేద్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా కించపరిచే వ్యాఖ్యలు చేశారని, వెంటనే బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. పులి శ్రీను, సుధారాణి, సంధ్య, బాలరాజు, విజయ, కలమ్మ పాల్గొన్నారు.

అమిత్‌షాను పదవి నుంచి తప్పించాలి

గార్ల: కేంద్ర హో మంత్రి అమిత్ షాను పదవి నుంచి తప్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కేంద్ర మంత్రి అమిత్‌షాకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో కళ్లకు నల్లా రిబ్బన్‌లు కట్టుకుని నిరసన తెపారు. ఆయన మాట్లాడుతూ అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని, క్షమాపణలు చెప్పాలన్నారు. సీపీఎం మండల కార్యదర్శి అలవాల సత్యవతి, ఈశ్వర్ లింగం, వీరస్వామి, చింత ఎల్లయ్య, లోకేశ్వరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

బయ్యారం: కేంద్ర మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని ఐఎన్‌టీయూసీ మండల కార్యదర్శి బరిగెల ఉపేందర్ అన్నారు. అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్‌నగర్‌లోని బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలోని రిజర్వేషన్ ద్వారా ఎంపీ, కేంద్ర హోంమంత్రి అయిన అమిత్‌షా అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందున వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. చెరుకుపల్లి నరసయ్య, నాగమణి, దాసరి శ్రీధర్, బాల్యం రవి పాల్గొన్నారు.

రైతులకు ఘన సన్మానం

రైతులను సన్మానిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవరెడ్డి

కేసముద్రం/ నెల్లికుదురు, డిసెంబర్ 23: జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని మార్కెట్ కార్యాలయంలో సోమవారం రైతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి మాట్లాడారు. రైతులు నూతన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వరరావు, మార్కెట్ డైరెక్టర్ ఓలం రమేశ్, చిదురాల వసంతరావు, అయూబ్‌ఖాన్, వీరన్న, వేముల శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కార్యదర్శి అమరలింగేశ్వరరావు ఉన్నారు. కాగా నెల్లికుదురు మండలం ఎర్రబెల్లిగూడెంలో జాతీయ రైతు దినోత్సవం నిర్వహించారు. ఎఫెక్ట్ సంస్థ ప్రతినిధి వంగాల రవీందర్ రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

పెద్దవంగర, డిసెంబర్ 23: విద్యార్థులు లక్ష్యంతో చదివి పదోతరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని లయన్స్ క్లబ్ ఎఫ్‌డబ్ల్యూసీ డాక్టర్ వి.శారద అన్నారు. సోమవారం వడ్డెకొత్తపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు సురేష్–సంధ్యారాణి ఆర్థిక సహకారంతో పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించారు. ఆమె మాట్లాడుతూ స్టడీ మెటీరియల్ ఉపయోగించుకొని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఇన్‌చార్జి హెచ్ఎం శేషవల్లి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు సురేష్, యాకయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఎరువుల షాపు తనిఖీ

దంతాలపల్లి, డిసెంబర్ 23: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను సోమవారం మరిపెడ ఏడీఏ విజయ్‌చంద్ర తనిఖీ చేశారు. ఎరువుల, మందుల నిలువలు, రిజిష్టర్లను పరిశీలించారు. రైతులు విక్రయించిన ఎరువులు, మందులు, విత్తనాలకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని సూచించారు. షాపు ముందు ధరల పట్టిక, ఎరువుల నిల్వ వివరాలతో బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మండల వ్యవసాయ అధికారి వహిని పాల్గొన్నారు.

కుడ్యాతండా జీపీలో మేఘ్యాతండాను చేర్చొద్దు

ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న తండావాసులు

చిన్నగూడూరు(మరిపెడ), డిసెంబర్ 23: మండలంలో నూతనంగా ఏర్పడిన కుడ్యాతండా గ్రామ పంచాయతీలో తమను చేర్చొద్దని మేఘ్యాతండాకు చెందిన పలువురు సోమవారం ఎంపీడీఓవిజయలక్ష్మికి వినతిపత్రం అందించారు. గ్రామస్తులు మాట్లాడుతూ మేఘ్యాతండాను పాత పంచాయతీ స్టేజీతండాలోనే కొనసాగించాలని కోరారు. తండావాసులు శ్రావన్‌రెడ్డి, రవికుమార్, లింగ్యా, వీరన్న, రాంసింగ్ ఉన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 23 : నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గునికంటి రాజన్న అన్నారు. సోమవారం పట్టణంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నెల్లికుదురు మండలం రామన్నగూడెంకు చెందిన నిరుపేదలకు ఇళ్ల స్థలాల మంజూరులో జాప్యం జరుగుతోందని, అధికారులు వెంటనే స్పందించి మంజూరు చేయాలని కోరారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

సీసీరోడ్డు పరిశీలన

కురవి, డిసెంబర్ 23: మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలోని సీసీ రోడ్డును సోమవారం పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి పరిశీలించారు. బస్టాండ్‌ను ఆనుకుని ఉన్న సీసీ రోడ్డుపై అక్రమ నిర్మాణాలు చేపట్టారని, వెనుక తాను కొనుగోలు చేసిన స్థలానికి ఇదే దారి అంటూ గ్రామానికి చెందిన బండారి రమేశ్ పలుమార్లు కలెక్టర్, తహసీల్దార్, ఎంపీడీవోకు వేర్వేరుగా ఫిర్యాదులు చేశాడు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి రోడ్డు ఎంత వరకు ఉంది? నిర్మాణాలు ఉన్నాయా లేవా? అనే విషయాన్ని పరిశీలించారు. ఆమెను వివరణ కోరగా ఫిర్యాదు మేరకు రోడ్డును పరిశీలించానని, నివేదిక ఉన్నతాధికారులకు అందించాక, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 23 : కాంట్రాక్ట్ మహిళా స్వీపర్‌తో అనుచితంగా ప్రవర్తించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజేశ్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు అన్నారు. సోమవారం మున్సిపల్ సాధారణ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సిబ్బందిపై దురుసుగా వ్యవహరిస్తున్నారని, జూనియర్ అసిస్టెంట్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ అజమాయిషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. శ్రీనివాస్, సుజాత, నిర్మల, వీరన్న, మంజుల పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలకు జీవనభృతి ఇవ్వాలి

మహబూబాబాద్ రూరల్, డ